వివిధ దూరవిద్య పీజీ కోర్సుల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే వివిధ పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెస్సీ ఐఎస్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ ఐఎస్ కోర్సు బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 29లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

పీజీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 28లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 3 వరకు చెల్లించవచ్చునన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఆడియాలజీ, ఎమ్మెస్సీ స్పీచ్ లాంగ్వేజ్ ప్యాథాలజీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ లా కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగనివ్వొద్దు

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పుట్‌పాత్ వ్యాపారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, జనవరి 23: ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు అసౌకర్యం కల్పించకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. పుట్‌పాత్ వ్యాపారాలు తొలగిస్తున్న నేపథ్యంలో గురువారం జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో కలిసి మోండామార్కెట్, జనరల్ బజార్, బేగంపేట్, పీజీ రోడ్డు, మినిస్టర్ రోడ్డు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఇష్టానుసారంగా రోడ్లపై వ్యాపారాలు చేస్తూ పాదాచారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్టు, అలాగే పుట్‌పాత్ వ్యాపారాలు చేసుకునే వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని అక్రమంగా పుట్‌పాత్ వ్యాపారాలు ప్రోత్సహిస్తున్నట్టు తెలిసిందన్నారు. ఎవ్వరికి ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని అలాగే పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. త్వరలోనే పుట్‌పాత్ వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

స్వతంత్ర పోరులో నేతాజీ సేవలు అమోఘం

వారాసిగూడలోని నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ హేమ, తదితరులు



నగర గ్రంథాలయంలో చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, పద్మజ సిబ్బంది

న్యూ బోయిన్‌పల్లి నేతాజీ నగర్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్, తదితరులు

సికింద్రాబాద్, జనవరి 23: సుభాష్ చంద్రబోస్ జయంతిని సికింద్రాబాద్‌లో నాయకులు ఘనంగ జరుపుకున్నారు. పలు డివిజన్లలో కార్పొరేటర్లు, నాయకులు నేతాజీ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. వారాసిగూడలోని నేతాజీ విగ్రహానికి సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో మగ్గిపోతున్న ప్రజలకు అండగా నిలిచి, బ్రిటిష్ వారిని గడగడలాడించిన భరతమాత ముద్దుబిడ్డ నేతాజీ అంటూ కొనియాడారు. నిరంకుశ బ్రిటిష్ పాలకులను ఎదిరించేందుకు తనదైన పంథాలో పోరాడిన దేశభక్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్ (ఇండియన్ నేషనల్ ఆర్మీ) స్థాపకుడిగా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం నేతాజీ చేసిన అవిశ్రాంత పోరాటం లక్షలాది మంది హృదయాలను ఉత్తేజపరిచిందని ఆమె అన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని వారసిగూడ చౌరస్తాలో ఉన్న నేతాజీ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ కంది శైలజ నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంగాపురం ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత నివాళులర్పించారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న నేతాజీ విగ్రహానికి ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్‌యూసీ (కమ్యూనిస్టు) పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం: న్యూబోయిన్‌పల్లిలోని యాదవ భవన్, నేతాజీనగర్ స్వామి వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు ఆరోవార్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, విఠల్‌రావు, యాదవ్, వెంకట్‌యాదవ్, ఓంప్రకాష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో సుభాష్ చంద్ర బోస్ జయంతి నిర్వహించారు. నగర గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, గ్రంథాయల కార్యదర్శి పద్మజ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రాంథాలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలమూరు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్‌స్వామి గౌడ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు కొండారెడ్డి, బాలకృష్ణ, యాదయ్య, రఘునందర్‌రెడ్డి, వాకర్స్ క్లబ్ ఆఫ్ సెంట్రల్ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్.జయదేవ్, స్కైలాబ్‌బాబు, రాజ్‌కుమార్ హాజరై నివాళులర్పించారు.

ట్రేడర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జనవరి 23: కవాడిగూడ-ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆవిష్కరించారు. కవాడిగూడ-ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాకేష్‌గుడినియే, ఉపాధ్యక్షుడు తలకొక్కుల సంజీవ కుమార్, ప్రధాన కార్యదర్శి పీఎస్ రాజు, కోశాధికారి శేరుపల్లి గణేశ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కవాడిగూడ నుంచి ముషీరాబాద్ చౌరస్తా వరకు జరిగే రోడ్డు విస్తరణలో వ్యాపారస్తులకు న్యాయం జరిగేలా అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. అసోసియేషన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించడంపై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్, జనవరి 23: ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఒత్తిడిని జయించడంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి విద్యార్థులపై వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు అధిక మార్కులు రావాలని తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడం వారి ఆరోగ్య సమస్యలపై ప్రభావం చూపుతుందని అన్నారు. సరిగా నిద్ర లేకపోవడం, స్వీయ ప్రేరేపిత ఒత్తిడి వల్ల పిల్లల మనస్సుల్లో ఒక అపనమ్మకం పెరుగుతుందని అన్నారు. ఇటువంటివి ఒత్తిడి తీసుకురాకుండా ఉండటం, ఒత్తిడిని జయించడంపై ఆరోగ్య సూత్రలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ కమలమ్మ, మాదగిరి రాజు, ఏఎన్ఎం అనూష, శ్రవంతి, భువనేశ్వరి, సునీత, దీపిక, అమృత వివిధ ప్రాథశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు నవీన్‌రాజు, ముప్పిడి నర్సింగ్, రఘు, లోకేష్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

– ముషీరాబాద్, జనవరి 23:

బీసీ విద్యార్థుల శంఖారావ సభను జయప్రదం చేయండి

సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న నిర్వహించనున్న బీసీ విద్యార్థుల సమర శంఖారావ సభను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సభ వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ల బిల్లులు కాకుండా కళాశాల విద్యార్థుల ఫీజులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి విడుదల చేయకపోవడంతో వారి చదువులు అటకెక్కుతున్నాయని వాపోయారు. ఈ బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు విడుదల చేస్తోందని ఆరోపించారు. ఈనెల 30న బీసీ విద్యార్థుల సమర శంఖారావ సభను ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించాలి



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య

ముషీరాబాద్, జనవరి 23: విద్యార్థులకు దేశభక్తి, సమాజ పోకడలపై అవగాహన కల్పించాలని హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య అన్నారు. గురువారం ముషీరాబాద్‌లో గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని హైదరాబాద్ జిందాబాద్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలనే తపనతో తమ సంస్థ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు ఫిబ్రవరి 2న రవీంద్రభారతిలో సర్టిఫికెట్లు, బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు శ్రీవల్లి, యాదగిరి, సాంబశివరావు, రజిని, అరుణ్, లక్ష్మణ్, వెంకటేశ్, చారి, రాజమౌళి, రఘు, భారతి, శ్రీనివాసరావు తదితరులు ల్గొన్నారు.

కేవీలో పరీక్షా పే చర్చ కార్యక్రమం

బొల్లారం, జనవరి 23: అవసరమైన జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి పరీక్షా పే-చర్చ వేదిక ఎంతగానో దోహదపడుతుందని బోయిన్‌పల్లి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కుసుమ్ లత అన్నారు. గురువారం బోయిన్‌పల్లి కేవీలో కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వివిధ రకాల నృత్యాలు, ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

ముషీరాబాద్, జనవరి 23: శ్రీసాయి సంగీత లహరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. గాయకులు ఆలపించిన మధురగీతాలు రంజింప చేశాయి. కార్యక్రమంలో శ్రీసాయి సంగీత లహరి సంస్థ అధ్యక్షుడు ఎ.రామప్రసాద్ పాల్గొన్ని గాయకులను సత్కరించారు. సంస్థ ఉపాధ్యక్షురాలు ఎం.శ్రీదేవి, రామ్‌రాజ్, నాగమణి, రాధారాణి, గాయని, గాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి

తిరుమలగిరి చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారి ఎర్ర స్వామి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు

బొల్లారం, జనవరి 23: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని తిరుమలగిరి చౌరస్తాలో గురువారం తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, రవాణా శాఖ అధికారి ఎర్ర స్వామి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ, కరపత్రాలు పంచుతూ వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై ప్రతిరోజు జరిమానాలు విధిస్తూ, కోర్టు యందు హాజరుపరుస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీకాంత్, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అతివేగమే ప్రమాదాలకు కారణం

అడ్డగుట్ట: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనను పెంచుకోవడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చునని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం మెట్టుగూడ ఆలుగడ్డ బావి చౌరస్తా వద్ద వాహనదారులకు ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగంగా డ్రైవింగ్ చేయడం సరికాదని, ప్రమాదాల నివారణలో అవగాహన అవసరమని ఆయన నొక్కిచెప్పారు. వాహనదారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

చిక్కడపల్లి, జనవరి 23: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్ చేస్తూ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కాశీం హాజరై శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రలో ఆవిష్కరించారు. ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. వర్గీకరణతో భారత రాజ్యాంగం ప్రకారం అట్టుడుగు వర్గాలందరికీ న్యాయం జరగాలన్నారు. తెలంగాణ లెదర్ ఇండస్ట్రీ ప్రమోషన్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లను నియమించడంతో పాటు 12వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. సద్గురు సంత్ రవిగురుదాస్ జయంతని ఫిబ్రవరి 12న వారణాసిలో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న విధంగానే మన రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్వహించాలని అన్నారు. మాదిగ భనవం ఐదు ఎకరాల స్థలంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. ఫోరం ప్రధాన కార్యదర్శి నతానియల్, ట్రెజరర్ బెజ్జంకి రాంబాబు, ఉపాధ్యక్షుడు సాయిబాబా, నర్సింగ్‌రావు, నరసయ్య, ఆంజనేయులు, జాన్, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావునగర్‌లో 'ఆపరేషన్ రోప్'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం 'ఆపరేషన్ రోప్' స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పద్మారావునగర్ పార్కు చుట్టూ పోలీసులు డ్రైవ్‌లో భాగంగా పుట్‌పాత్ ఆక్రమణల తొలగించారు. పుట్‌పాత్‌ను ఆక్రమించిన చిల్లర వ్యాపారులు, తోపుడు బళ్లను ఖాళీ చేయించి, ఆక్రమణలన్నింటినీ తొలగించారు. పాదచారులు, ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తున్న వారికి జరిమానా విధించారు.

బాగ్‌లింగంపల్లిలో మరోసారి

చిక్కడపల్లి: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లి ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్ మరోసారి నిర్వహించారు. గత శుక్రవారం సుందరయ్య పార్క్ ప్రాంతాల్లో పుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. గరువారం ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షణలో ఆక్రమణలు తొలగించారు. ట్రాఫిక్ డీసీపీ ఎ.అశోక్, అడిషన్ డీసీపీ రాందాస్ తేజావత్, ఏసీపీ ఎర్రా, జీహెచ్‌హెంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ పర్యవేక్షణలో బాగ్‌లింపల్లి నుంచి వీఎస్టీ చౌరస్తా వరకు పుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, ఎస్సైలు నాగరాజు, ఎస్సైలు అభిలాష్, మోనిక చిక్కడపల్లి ట్రాఫిక్ ఎస్సై పెంటాగౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సిబ్బంది

బాలుడి అదృశ్యం

తనుష్ కాంబ్లీ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు అదృశ్యమైన ఘటన ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్‌మండిలో నివాసముండే స్వర్ణ, విశాల్ దంపతుల కుమారుడు తనుష్ కాంబ్లీ (14) చైతన్య టెక్నో స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాల వద్ద తనుష్‌ను దింపి తల్లి స్వర్ణ ఉద్యోగానికి వెళ్లింది. తిరిగి సాయంత్రం ఏడు గంటలకు ఇంటికి రాగా తనుష్ లేడు. వెంటనే ట్యూషన్ కేంద్రానికి వెళ్లగా, తన స్నేహితుడి పుట్టిన రోజు పార్టీ ఉందని చెప్పి వెళ్లిపోయినట్లు తెలిసింది. స్నేహితులను విచారించగా మాణికేశ్వరీనగర్‌లో నివాసముండే స్నేహితుడి దగ్గరకు వచ్చి, అతడి ఫోన్ నంబర్‌ను ఒక పేపర్‌పై రాసుకుని వెళ్లినట్లు తెలిసింది. తనుష్ గురించి స్నేహితులు, సన్నిహితులు, బంధువులను వాకబు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో గొడవ.. ఆరు రోజుల జైలుశిక్ష

నిందితులు

ఉస్మానియా యూనివర్సిటీ